
క్లుప్తంగా

పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించండి


రెవెన్యూ సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్

ఇంకొల్లు(చినగంజాం): పెండింగ్‌లో ఉన్న సమస్యలను రెవెన్యూ సిబ్బంది సత్వరం పరిష్కరించాలని తహసీల్దార్ ఏవీఎస్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్యాస్ట్ సర్టిఫికెట్ సమస్య, 22 ఏకి సంబంధించిన పెండింగ్‌లో ఉన్న ఫైల్స్ గురించి సిబ్బందిని వివరణ కోరారు. కలెక్టర్ కార్యాలయ నుంచి వచ్చి ఓటరు జాబితాకు సంబంధించిన ప్రొఫార్మా గురించి మాట్లాడారు. వీఆర్వోలు, అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స.హ. చట్టం బోర్డులో
పేర్లు మార్చరా..?



నేటికీ పాత అధికారుల పేర్లతో దర్శనమిస్తున్న బోర్డు

చీరాల టౌన్: తహసీల్దార్ కార్యాలయంలోని స.హ చట్టం బోర్డులో పేర్లు మారలేదు. గతంలో పనిచేసి వేరే ప్రాంతానికి బదిలీ అయిన అధికారుల పేర్లే దర్శనమిస్తున్నాయి. పౌర సమాచార అధికారిగా.. ప్రస్తుతం డీటీగా సుశీల విధులు నిర్వహిస్తుండగా చీరాల నుంచి సంతమాగులూరుకు బదిలీ అయిన అప్పటి అధికారి పి.సురేష్ పేరును మార్చలేదు. అలానే మొదటి అప్పీలేట్ అధికారిగా గతంలో చీరాల ఆర్డీవోగా పనిచేసి వేరే ప్రాంతానికి బదిలీ అయిన పి.సరోజిని పేరు కూడా మార్చలేదు. ప్రస్తుతం చీరాల ఆర్డీఓగా టి.చంద్రశేఖర నాయుడు పనిచేస్తున్నా.. బోర్డులో పాత అధికారి పేరు ప్రదర్శించడంపై ప్రజలు విమర్శిస్తున్నారు.

పార్కింగ్ కేంద్రంగా
తహసీల్దార్ కార్యాలయం


ప్రయివేటు వాహనాలతో నిండిపోయి పార్కింగ్ ప్రదేశంగా మారిన మండల ప్రభుత్వ కార్యాలయాల సముదాయం

చీరాల టౌన్: చీరాల ప్రభుత్వ కార్యాలయాల సముదాయ ప్రాంతం ప్రయివేటు వాహనాల పార్కింగ్‌కు కేంద్రంగా మారింది. నిత్యం వందలాది మంది చీరాల పట్టణం, గ్రామ పంచాయతీలకు చెందిన ప్రజలు వచ్చే తహసీల్దార్, మండల పరిషత్, ఉపఖజానా, హౌసింగ్, ఆర్‌అండ్‌బీ కార్యాలయాలు ఉన్న ప్రదేశం కాస్తా వివిధ రకాల భూముల రిజిస్ట్రేషన్, షాపింగ్‌లకు చీరాల వచ్చిన వారి వాహనాలతో నిండిపోతోంది. తహసీల్దార్ కార్యాలయాన్ని ఆనుకుని ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి రిజిస్ట్రేషన్లు, కూరగాయల మార్కెట్‌లో కొనుగోలుకు వచ్చిన కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలను తహసీల్దార్ కార్యాలయం ముందు నిలుపుదల చేయడంతో వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు వస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల స్థాయి అధికారులు స్పందించి చీరాల ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో ప్రయివేటు వాహనాల నిలుపుదల లేకుండా చేసి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారం కోసం రణభేరీ


బాపట్లకు బయలుదేరిన యూటీఎఫ్ నాయకులు

కారంచేడు: కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఏర్పడిన విద్యారంగ సమస్యలను పరిష్కరించుకొనేలా రణభేరీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు యూటీఎఫ్ నాయకులన్నారు. జిల్లా కేంద్రమైన బాపట్లలో నిర్వహించనున్న ఈ రణభేరీకి కారంచేడు మండలంలోని యూటీఎఫ్ నాయకులు ద్విచక్రవాహనాలు, కార్లలో బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై యూటీఎఫ్ నిరంతరం పోరాటాలు చేస్తూనే ఉందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భవనం శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యురాలు రావి పద్మావతి, మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏ. శ్రీనివాసరావు, జి. రమేష్‌రెడ్డి, పావులూరి శ్రీనివాసరావు, సువర్ణ బాబు, మస్తాన్‌భీ, మీరావలి, బాబూరావు, హుస్సేన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రుసుం లేకుండా స్మార్ట్ కార్డుల పంపిణీ


మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్

ఇంకొల్లు(చినగంజాం): స్మార్ట్ కార్డుల పంపిణీ విషయంలో ఎటువంటి రుసుం తీసుకోకుండా ఉచితకంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ ఏవీఎస్ శ్రీనివాస్ రేషన్ డీలర్‌లకు సూచించారు. బుధవారం మండల తహసీల్దార్ కార్యాలయం రేషన్ డీలర్‌లతో ఆయన సమావేశం నిర్వహించారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక నాయకులతో ప్రారంభించి మిగిలిన కార్డుల పంపిణీని పూర్తి చేయాలని సూచించారు. చనిపోయిన వారి కార్డులు, వలస వచ్చిన వారి కార్డులు పంపిణీ చేయకుండా నిలుపుదల చేయాలని కార్డుల పంపిణీ విషయంలో లబ్ధిదారుల నుంచి ఎటువంటి రుసుం వసూలు చేయరాదని ఆదేశించారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ సురేష్, వీఆర్వోలు పాల్గొన్నారు.

పాలు ఇచ్చే విధానంపై అవగాహన ఉండాలి


యద్దనపూడి: ప్రతిజ్ఞ నిర్వహిస్తున్న తల్లులు, అంగన్‌వాడీ కార్యకర్తలు


నూతలపాడులో తల్లులకు అవగాహన కల్పిస్తున్న సూపర్ వైజర్


జె.పంగులూరు: అంగన్వాడీ కేంద్రంలో పోషకాహారం మాసోత్సవాలు


బల్లికురవలో పోషణ కిట్లు అందజేస్తున్న సీడీపీఓ

యద్దనపూడి: శిశువులకు, చిన్నారులకు ఫీడింగ్ ఇచ్చే విధానంపై తల్లులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని అంగన్‌వాడీ సూపర్ వైజర్ సుజాత సూచించారు. పోషణ మహా కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని తనుబొద్ది వారిపాలెం లో కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ సుజాత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబరు 16 వరకు పోషణ మహా కార్యక్రమాన్ని నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారని అందులో భాగంగా తల్లులకు, అంగన్ వాడీ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. పోషణకు సంబంధించి ప్రతిజ్ఞ నిర్వహించారు. శిశువులకు, చిన్నపిల్లలకు తల్లిపాలు అందజేసే విధానం, ఫీడింగ్ అందించే పద్ధతులను గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు సరిత, మరియమ్మ, ఎంఎల్‌హెచ్ పి. సుకన్య, పాఠశాల ఉపాధ్యాయిని, రాజేశ్వరి, ఆశ వర్కర్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఏ. అనురాధ, వి. అశ్విని, ఏ. రేవతి పాల్గొన్నారు.

నూతలపాడు(చినగంజాం): నూతలపాడు సెక్టార్ పరిధిలో బుధవారం ఎనిమిదో పోషణ మాసోత్సవ కార్యక్రమాన్ని పంచాయతీ పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించారు. శిశువులకు పాలిచ్చే విధానం, చిన్నారులకు ఆహారం ఇచ్చే విధానాలు, పద్ధతులపై తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ బి. సునంద, అంగన్‌వాడీ కార్యకర్తలు ఆర్ఎస్ మాధవి, సుబాషిణి, క్రాంతి, రత్నకుమారి, కృష్ణవేణి, సునీత, సువర్ణ అంగన్‌వాడీ వర్కర్‌లు పాల్గొన్నారు.

జె.పంగులూరు: పోషకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఐసీడీఎస్ కొరిశపాడు ప్రాజెక్టు సీడీపీఓ ఎలిజిబెత్ రాణి అన్నారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా బుధవారం ముప్పవరం సెక్టార్‌లోని రామకూరు అంగన్వాడీ కేంద్రం- 4 లో కార్యక్రమం నిర్వహించారు. పోషకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన శిశువులకు జన్మనివ్వవచ్చని.. పిల్లలు ఆరోగ్యంగా పుడితే వారి ఎదుగుదల, తెలివితేటలు, ఆరోగ్యం బాగుంటాయన్నారు. తల్లులు, బాలింతలు, గర్భిణులు ఆహారంతో ఎక్కువ కూరగాయలు, పండ్లు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పుష్టికరమైన ఆహారాన్ని అందిస్తుందని, గర్భిణులు, బాలింతలు, తల్లులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. సూపర్‌వైజర్ పద్మజ మాట్లాడుతూ ముప్పవరం సెక్టార్‌లోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతల హాజరు మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. అనురాధ, అరుణ, తులసి పాల్గొన్నారు.

బల్లికురవ: తల్లీబిడ్డల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా ఐసీడీఎస్ పనిచేస్తుందని సంతమాగులూరు సీడీపీఓ డి. సుధ అన్నారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా బుధవారం బల్లికురవలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. పుట్టిన బిడ్డకు 3 సంత్సరాల వరకు తల్లి పాలు ఇవ్వాలని 6 నెలలు నిండగానే, ఘనాహారం అందించాలన్నారు. శారీరక ఎదుగుదలతోపాటు ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎత్తు, బరువు చూసుకోవాలని పోషణ్ కిట్లను పంపిణీ చేశారు. సూపర్‌వైజర్‌లు విజయనిర్మల, మీరాభి, సలోమి పాల్గొన్నారు.

శ్రామికుల ఆరాధ్య దైవం 'విశ్వకర్మ'


హోమంలో పాల్గొన్న జంటలు


చీరాల మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు


బల్లికురవలో విశ్వకర్మ జెండా ఆవిష్కరణలో తహసీల్దార్


కారంచేడులో నివాళులర్పిస్తున్న దృశ్యం

చీరాల అర్బన్: పనిముట్లతో జీవనం చేసే ప్రతి శ్రామికుని ఆరాధ్య దైవం విశ్వకర్మ అని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొతరపు జనార్దన్ అన్నారు. స్థానిక బాపనమ్మ కళ్యాణ మండపంలో బుధవారం ది చీరాల పేరాల పట్టణ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. కార్యక్రమానికి ఏఎంసీ చైర్మన్ కొతరపు జనార్దన్, మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వకర్మ విశ్వశిల్పి అని, దేవతలకు నగరాలు, ఆయుధాలు, విమానాలు, ఆలయాలు నిర్మించారన్నారు. అటువంటి వారి జయంతిని జరుపుకోవడం సంతోషకరమన్నారు. రిటైర్డు ప్రిన్సిపాల్ ఎ.నాగవీరభద్రాచారి మాట్లాడుతూ విశ్వకర్మ ద్వారకానగరం, ఇంద్రప్రస్థం, పుష్పకవిమానం, సుదర్శన చక్రం, మయసభ వంటి నిర్మాణాలు చేసి దేవతల శిల్పకారుడుగా పేరొందారన్నారు. సభకు సంఘ అధ్యక్షులు నాగులకొండ గోపీ వెంకట ఆనంద్ అధ్యక్షత వహించారు. ప్రధాన కార్యదర్శి రామోజు వెంకటనరసింహాచారి, చిప్పాడ చిట్టి ప్రసాద్, సిద్దు శ్రీనివాసరావు, మానేపల్లి సత్యనారాయణమూర్తి, వి.కృష్ణమూర్తి, దోగిపర్తి వెంకటసురేష్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

బల్లికురవ: విశ్వబ్రాహ్మణులు చేతి వృత్తుల ద్వారా సకల మానవాళికి అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని తహసీల్దార్ రవినాయక్ కొనియాడారు. బుధవారం బల్లికురవలో జరిగిన విశ్వకర్మ జయంతిలో భాగంగాజెండా ఆవిష్కరించారు. ఉదయం విశ్వకర్మ సుప్రభాతం, ఉపనిషత్ పారాయణ, వేద స్వస్తి, పంచాయమృతాభిషేకం చేపట్టారు. మండలంలోని విశ్వబ్రాహ్మణ కుటుంబాలంతా పాల్గొన్నాయి.

విశ్వకర్మ భగవాన్‌కు ఘన పూజలు

కారంచేడు: మండల కేంద్రమైన కారంచేడు చినవంతెన సెంటర్‌లో బుధవారం విశ్వకర్మ భగవాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కణితి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి ముందుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన అందించిన సేవలను కొనియాడారు. వేల్పూరి శ్రీనివాసరావు, అప్పలాచారి, బాలకృష్ణ, లక్ష్మణాచారి, సత్యన్నారాయణ, నాగమలేశ్వరరావు, చెంచురామయ్య పాల్గొన్నారు.


సుప్రీం ఆదేశాలపై ముస్లింల హర్షం

అద్దంకి: వక్ఫ్ సవరణ చట్టం 2025పై సుప్రీం కోర్టు ఇచ్చిన తాత్కాలిక ఆదేశాలపై ముస్లింలు హర్షం వ్యక్తం చేస్తున్నారని రాష్ట్ర నూర్ బాషా సంఘం అధ్యక్షుడు కొటికలపూడి శ్రీను ఒక ప్రకటనలో తెలిపారు. వక్ఫ్ సవరణ చట్టంలోని మూడు సెక్షన్లపై సుప్రీం కోర్టు స్టే ఇవ్వడం శుభపరిణామమని తెలిపారు. ఓటు బ్యాంకు రాజకీయాలు కాకుండా ముస్లింలకు మొదట నుంచి అండగా ఉంటున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముస్లింలు ఎప్పటికీ మరచిపోలేరన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లు నేపథ్యంలో ముస్లింలను పూర్తిగా వంచించిందని తెలిపారు.

రేపటి నుంచి చిత్రలేఖనం, పెయింటింగ్ శిక్షణ

అద్దంకి రూరల్: కలశం ఫైన్‌ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో ఆంధ్ర ప్రభుత్వ భాషా సంస్కృతిక శాఖ సౌజన్యంతో ఈనెల 19 నుంచి 21 వ తేదీ వరకు ఉచితంగా పెయింటింగ్, చిత్రలేఖనంపై శిక్షణ కార్యక్రమం అద్దంకిలో నిర్వహించనున్నారు. ఈమేరకు కలశం ఫైన్‌ఆర్ట్ అకాడమీ అధ్యక్షురాలు డి. అనూష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భోజన వసతితోపాటు, రంగులు, బ్రష్‌లు, పెన్సిల్స్‌లు, మెటీరియల్‌ను ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 9182681614 నంబరును సంప్రదించాలని కోరారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత తగ్గకూడదు


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఈఓ పురుషోత్తం

చీరాల అర్బన్: పాఠశాలల్లో అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత ప్రమాణాలను తగ్గించకుండా విద్యార్థులకు మెరుగైన భోజనాన్ని అందించాలని డీఈఓ పురుషోత్తం అన్నారు. బుధవారం చీరాల్లోని ఎస్ఆర్‌పీఎం హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం అమలు తీరును ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న మెనూ పరిశీలించారు. పాఠశాల పరిసరాలు, పథకానికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. రోజూ ఎంత మంది విద్యార్థులు భోజనం చేస్తున్నారని హెచ్ఎం బి.సాల్మన్‌ను అడిగి తెలుసుకున్నారు. భోజనం రుచి చూసి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఆయన కూడా భోజనం చేశారు. అనంతరం మండల విద్యావనరుల కేంద్రానికి వెళ్లి ఎంఈఓ రమాదేవితో మాట్లాడారు. ప్రతి విద్యార్థి పేరు, వివరాలు ఆన్‌లైన్ చేయాలన్నారు.

ప్రతీ అర్జీదారునికి ప్రాధాన్యత


అర్జీదారులను విచారిస్తున్న ఆర్డీఓ చంద్రశేఖర నాయుడు

చీరాల టౌన్: తమ సమస్యల పరిష్కారం కోసం పీజీఆర్ఎస్‌లో అర్జీలు దాఖలు చేసిన ప్రతి అర్జీదారుని సమస్యను పరిష్కరించి న్యాయం చేసేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నామని చీరాల ఆర్డీఓ తూమాటి చంద్రశేఖర నాయుడు తెలిపారు. బుధవారం చీరాల రెవెన్యూ డివిజన్ పరిధిలోని చీరాల, వేటపాలెం, కారంచేడు, ఇంకొల్లు, చినగంజాం మండలాల్లోని ప్రజలు పెట్టుకుని పీజీఆర్ఎస్, భూ సమస్యల అర్జీలపై ప్రత్యేక పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించారు. ప్రత్యేక పీజీఆర్ఎస్, ఇతర రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ఆయా మండలాల తహసీల్దార్లు, డీటీలు, ఆర్ఐలు, రీ సర్వే టీడీలు, అర్జీదారులతో కలిసి పూర్వపు రికార్డులు, అర్జీదారుని ఆధారాలతో ప్రత్యేకంగా పరిష్కార వేదిక చేపట్టారు. కార్యక్రమంలో భాగంగా 54 అర్జీలు పూర్తిగా ఆధారాలు, రికార్డులతో విచారించి బాధితులకు న్యాయం చేశారు. మూడు అర్జీలకు సంబంధించి క్షేత్ర స్థాయి విచారణ చేసి వాటికి కూడా పరిష్కారం చూపుతామని ఆర్డీఓ తెలిపారు. ఈ సందర్భంగా ఆర్డీవో చంద్రశేఖర నాయుడు మాట్లాడుతూ చీరాల ఆర్డీవో డివిజన్ పరిధిలో ఉన్న ప్రతి మండలంలో వచ్చిన భూ సమస్యలు, పీజీఆర్ఎస్ అర్జీలను పరిష్కరించేందుకు డివిజన్ పరిధిలోని ప్రతి మండలాలకు ఒకసారి ప్రత్యేక పరిష్కార వేదికను నిర్వహిస్తున్నామన్నారు. ఆన్‌లైన్లో వివరాలను కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌కు నివేదించి పరిష్కారం చేస్తున్నామన్నారు. అలానే అర్జీదారుని ఎండార్స్‌మెంట్లు కూడా అందిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు నాగరాజు, ప్రభాకరరావు, శ్రీనివాసరావు, డీటీ సుశీల, సర్వేయర్లు, పంచాయతీల కార్యదర్శులు, వీఆర్వోలు, అర్జీదారులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్య సంరక్షణే లక్ష్యం


స్వర్ణ పీహెచ్‌సీ నుంచి అవగాహన ర్యాలీ చేస్తున్న ఎంపీడీఓ, డాక్టర్ శాలిని


యద్దనపూడిలో వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది


ఇంకొల్లు: ప్రభుత్వ ఆరోగ్య పథకాలు గురించి వివరిస్తున్న వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది


మాట్లాడుతున్న సీడీపీఓ ఝాన్సీ

కారంచేడు: గ్రామాల్లోని మహిళల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని రూపొందించినట్లు కారంచేడు, స్వర్ణ పీహెచ్‌సీల వైద్యాధికారులు డాక్టర్ గోరంట్ల సురేష్‌బాబు, డాక్టర్ ఎం. శాలిని అన్నారు. బుధవారం కారంచేడు పీహెచ్‌సీ, స్వర్ణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్‌లో మాట్లాడారు. స్వర్ణ పీహెచ్‌సీ వద్ద ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రామ్మోహనరావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. బీపీ, షుగర్‌తో పాటు నోటి కాన్సర్, రొమ్ము కాన్సర్, గర్భాశయ కాన్సర్ వంటి వ్యాధుల సోకినప్పుడు అవగాహన కల్పిస్తున్నామన్నారు. సర్పంచ్ మోటాని మధుసూదనరావు, డాక్టర్ ప్రదీప్‌కుమార్, డాక్టర్ ఉష, పీహెచ్ఎన్ ఖాజాబీ, హెచ్ఈఓ నాగేశ్వరరావు, హెచ్‌వీ మాధురీ సిఫోరా, సూపర్‌వైజర్ శ్రీనివసరావు పాల్గొన్నారు.

సంతరావూరు(చినగంజాం): మహిళలు ఆరోగ్య సమస్యలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సంతరావూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కె. కీర్తి సరోజ్ అన్నారు. బుధవారం సంతరావూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మాట్లాడారు. ఎంపీడీఓ ఎస్. విజయ, వై. లక్ష్మి, ఎంపీహెచ్ఈఓ యు. వెంకటరమణ, హెచ్ఎస్ శ్రీధర్,హెచ్‌వీ వరదానం పాల్గొన్నారు.

వేటపాలెం: ఆరోగ్యకరమైన మహిళ శక్తివంతమైన కుటుంబానికి బలమైన పునాది లాంటిదని సీడీపీఓ ఝాన్సీ పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మాట్లాడుతూ సమగ్ర పోషణకు బలమైన అడుగులు వేయాలన్నారు. ఎంపీడీఓ ఎం. రాజేష్, ఎంఈఓ జీవీ సుబ్బయ్య, దయామణి, అరుణ, సూపర్‌వైజర్ పుష్పవల్లి, శివజ్యోతి, సుదాకర్, మార్తమ్మ పాల్గొన్నారు.

యద్దనపూడి: గ్రామాల్లోని ప్రజలకు ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని యద్దనపూడి వైద్యాధికారి డాక్టర్ శ్రీ హర్ష అన్నారు. స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని తనుబొద్ది వారిపాలెం, యద్దనపూడిలో బుధవారం ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భిణులకు పరీక్షలు, క్యాన్సర్ స్క్రీనింగ్, పీఎంజేఏవై కార్డులు, టీకాలు, క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని అన్ని గ్రామాల్లో అక్టోబరు 2 వ తేదీ వరకు సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు వైద్యాధికారులు తెలియజేశారు. తనుబొద్ది వారిపాలెం గ్రామ సర్పంచ్ చల్లా అన్నపూర్ణమ్మ, అనంతవరం వైద్యాధికారి డాక్టర్ సౌమ్య, సీహెచ్ఓ కె. చంద్రశేఖర్, సూపర్‌వైజర్‌లు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాలు పాల్గొన్నారు.

ఇంకొల్లు (చినగంజాం): ప్రభుత్వం అందించే ఆరోగ్య కార్యక్రమాలను ప్రజలు పూర్తి అవగాహనతో సద్వినియోగం చేసుకోవాలని ఇంకొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ టి. అంజలి, జి. భానుప్రకాష్ సూచించారు. ఇంకొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. మాతాశిశు సంరక్షణ సేవలు, వ్యాధి నిరోధక టీకాలు ఇచ్చే కార్యక్రమం, సమీకృత ఆహారాన్ని తీసుకోవటం గురించి చైతన్య పరచాలన్నారు. అంటువ్యాధులు కాని వ్యాధులు బీపీ, షుగర్, క్యాన్సర్ గురించి అవగాహన కలిగించడం, కళ్లు, ముక్కు, గొంతు, దంతాలు గురించి తెలియజేశారు. సీడీపీఓ సులోచన, ఆసుపత్రి సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతో విద్యావ్యవస్థ అస్తవ్యస్తం


చీరాల: రణభేరీ బైక్ జాతా నిర్వహిస్తున్న యూటీఎఫ్ నాయకులు


ఇంకొల్లు స్థూపం సెంటర్‌లో మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకులు

చీరాల అర్బన్: ప్రభుత్వ నిర్లక్ష్యం వలనే విద్యావ్యవస్థ అస్తవ్యస్తమైందని యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ హనుమంతరావు ధ్వజమెత్తారు. ఆర్థిక, విద్యా రంగ సమస్యల పరిష్కారం కోరుతూ యూటీఎఫ్ బాపట్ల జిల్లా ఆధ్వర్యంలో రేపల్లె నుంచి మార్టూరు వరకు చేపట్టిన రణభేరి ప్రచార బైక్ జాతాను బుధవారం చీరాలలో నిర్వహించారు. రేపల్లె నుంచి బయలుదేరి బైక్ జాతా చీరాల గడియార స్తంభం సెంటర్‌కు చేరుకుని మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నూతన విద్యావిధానం పేరుతో పాఠశాలలను పునఃవ్యవస్థీకరణ.. పాఠశాల వ్యవస్థలో 9 రకాల స్కూళ్లు పుట్టుకొచ్చాయన్నారు. అనేక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు ఏకోపాధ్యాయ స్కూళ్లుగా మారాయన్నారు. పీఆర్సీ కమిటీలో ఎలాంటి పురోగతి లేదన్నారు. పదోన్నతులు కల్పించాలని.. ప్రభుత్వానికి వినతి చేసినా పట్టించుకోలేదన్నారు. ఈనెల 25 న గుంటూరు భారీ సభను ఏర్పాటు చేశామన్నారు. జిల్లా అధ్యక్షుడు జడ వినయ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. శ్రీనివాసరావు, సహాధ్యక్షులు బండి భిక్షాలుబాబు, గౌరవాధ్యక్షుడు పాపారావు, ట్రెజరర్ వెంకటేశ్వరరెడ్డి, జిల్లా కార్యదర్శి పి.సురేష్, యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ఇంకొల్లు(చినగంజాం): ఏపీ యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బైక్ ర్యాలీ బుధవారం సాయంత్రం ఇంకొల్లు చేరుకుంది. స్థానిక స్థూపం సెంటర్‌లో నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కొమ్మోజీ శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు జై. వినయ్‌కుమార్, అడుగులు శ్రీనివాసరావు, ఎస్. పాపారావు, యు. చెంచయ్య, పేరుని సత్యనారాయణ పాల్గొన్నారు.

మార్టూరు: బాపట్ల జిల్లా రణభేరి యాత్ర బుధవారం రాత్రి మార్టూరులో ముగిసింది. చిలకలూరిపేట వరకు పంపించి వీడ్కోలు పలికారు.

మండల సమావేశం మమ


బల్లికురవలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

బల్లికురవ: మూడు నెలలకొకసారి గ్రామాల్లోని ప్రజా సమస్యలను చర్చించేందుకు ఏర్పాటు చేసిన మండల సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు గైర్హాజరు అవుతుంటే లక్ష్యం నీరు గారుతుందని ఎంపీడీఓ కుసుమ కుమారి అసహనం వ్యక్తం చేశారు. స్థానిక పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మీ అధ్యక్షతన మండల సమావేశం జరిగింది. ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం కోరం కావడంలో జాప్యం జరగడంతో గంట ఆలస్యంగా ప్రారంభమై అధికారులు ప్రగతి నివేదికలకే పరిమితం అయింది. వర్షాలు కురుస్తున్నందున సీజనల్ జ్వరాలు వ్యాధులపై చర్చించేందుకు 21 గ్రామ పంచాయతీల్లోని సర్పంచ్‌ల్లో ఒకరిద్దరు మినహా అంతా గైర్హాజరు అయ్యారు. వైద్యారోగ్యశాఖ అధికారులు సమావేశానికి డుమ్మా కొట్టారు. విద్య, విద్యుత్ పంచాయతీ రాజ్, విద్య పశువైద్యం, రెవెన్యూ, పంచాయతీరాజ్, వ్యవసాయం, వెలుగు ఐసీడీఎస్ అధికారులు ప్రగతి నివేదికను చదివి వినిపించారు. ఆర్‌అండ్‌బీ, ఆర్టీసీ, ఎన్నెస్పీ, మైనర్ ఇరిగేషన్ అధికారులు సమావేశానికి దుమ్మా కొట్టారు. ఇటీవల వైదన గ్రామ పంచాయతీ సర్పంచ్ మేడా జయలక్ష్మి గుండెపోటుతో చనిపోయినా సమావేశంలో ఆమె మృతి పట్ల మౌనం పాటించటం కూడా మరిచారు.